# బిందువు

పొయ్యిమీద బియ్యం పడేసి పరధ్యానంగా కూర్చున్నాడు దేవయ్య. బియ్యం కుత కుత మంటున్నాయి. అతనిదీ చిన్న యిల్లు. ఒక్క మండువా ఒక చిన్న గదీ అంతే. ముప్పయేళ్ళుగా ఆ ఇంట్లోనే కాపురం. పక్క వాటాలో రంగాజమ్మ, ఆమె కొడుకు కోడలూ కాపరం. వాళ్ళు వచ్చి ఓ ఏడాదయింది. అంతకు ముందు ఎవరెవరో ఉండిపోయారు. రంగాజమ్మ కొడుకు పిడబ్ల్యుడిలో గుమాస్తాగా ఉన్నాడు. కోడలు ఎక్కడో స్కూల్లో టీచరుగా పని చేస్తోంది. ఇద్దరూ పొద్దున వెళితే సాయంత్రం వస్తారు. అందాక రంగాజమ్మ ఒక్కతే వుంటుంది. ఇక్కడ తాను ఒంటరిగా అక్కడ ఆమె ఒంటరిగా! కాలం గడుస్తోంది.

రంగాజమ్మ చాలా సరదా అయిన మనిషి. అరవయ్యోపడిలో పడినా, ఏమిటో చిన్నపిల్లలా ఉత్సాహంగా ఉంటుంది. కొన్నాళ్ళుగా తనతో స్నేహం కలిపింది. అలా కొడుకూ కోడలూ వెళ్ళగానే ఇలా ఇంటికి తాళం పెట్టి తన దగ్గరకు పరిగెత్తుకు వస్తుంది వాళ్ళింట్లో చేసిన కూరో, పులుసో పట్టుకు వస్తుంది. పెద్దవాడివి ఒక్కడివి ఏం వండుకుంటావ్. ఇలా ఒంటరిగా బ్రతక్కపోతే, ఆ కూతురి దగ్గరకే పోరాదూ?" అంటుంది. ఆప్యాయంగా దగ్గర కూర్చుని అన్నం పెడుతుంది. తరువాతైనా వెళ్ళదు. చిన్న పిల్లలా కూర్చుని కబుర్లు చెపుతుంది. గవ్వలాడదామంటుంది. మళ్ళా ఆ కొడుకూ, కోడలూ వచ్చేదాకా అలా ఆడుతూనే ఉంటుంది.

అవిడ పావు గెలిచినా తన పావు చచ్చినా పసిపిల్లలా సంబరపడిపోతుంది. ఆవిడ ఉత్సాహం చూసి కాదనలేక, నిద్రవస్తున్నా తూగుతూ అలా ఆడుతూ ఉంటాను. అవిడ అప్పుడప్పుడూ రావడమూ, అప్యాయంగా పలకరించడమూ, తనకు ఎంతో ఊరటగా ఉంది. మనస్సు మరీ నీరసపడి పోకుండా బ్రతుకేక్కడో నిండుదనం వచ్చినట్లుంది.

అయినా ఈ మధ్య అలా కొడుకూ, కోడలూ వెళ్ళిపోగానే ఇలా ఈవిడ ఇల్లు తాళం పెట్టుకుని ఇక్కడికి రావడం చూసి ఇరుగూ పొరుగూ ఏమనుకుంటారోనన్న భయం పీకుతోంది. అవిడకు అరవై, తనకు డెబ్బై నిండినా ఈ స్నేహాన్ని ఎవరూ మంచిగా అర్థం చేసుకోరేమో ! వింతగా చూస్తారేమో ? ఈ పెద్ద తనంలో రామా, కృష్ణా అనుకోక ఈ కబుర్లేమిటి. ఈ గవ్వలాటలేమిటి అని అందరూ అసహ్యించుకుంటారేమో ? ఆ భయం పీకుతోంది. ఆమెను రావద్దంటే జీవితంలో ఉన్న ఒక్క కాంతి పోగొట్టుకోవడం అవుతుంది. అయినా ఆవిడ ఏం బాధపడుతుందో ?

అన్నం మాడు వాసన కొడుతుంది. దింపి కింద పడేశాడు. కుంపటి చల్లార్చాను. ఇంకేమి చెయ్యాలనిపించలేదు. రోజు రోజూ ఈ అన్నం వండుకోవడానికి కూడా ఓపిక ఉండటంలేదు. ఏదో అలవాటుగా పది గంటలకు బియ్యం కడిగి పడేస్తాడు. ఒళ్ళంతా ఒకటే నొప్పులు. ఈ చలి కాలంలో దగ్గూ రొంపకూడా పట్టుకున్నాయి.

ఎప్పుడో ఒంట్లో కాస్త ఓపిక, చేతిలో కాస్త డబ్బులున్నప్పుడు ఈ కొంప కట్టుకున్నాడు ఇల్లు పెద్దదేమీకాదు. కట్టి నప్పుడే రెండు వాటాలకు వీలుగా కట్టాడు. పక్క వాటాలో వరసగా మూడు గదులున్నాయి. తన వాటాలో ఒక చిన్న మండువా, ఓ ప్రక్క చిన్న గదీ ! ఇంట్లోకి ఏ గాలీ వెలుతురూ వచ్చినా ఆ మండువాలో ఉన్న కాస్త అరుబయట ద్వారా రావాలి. ఆ కాస్తచోటే స్నానాల గదిగాకూడా ఉపయోగ పడుతుంది.

మందువాలో ఓ ప్రక్క చిన్న పట్టెమంచం ఉంది. దానిమీద పరుపూ దుప్పటీ ఏనాడు వేసినవో మాసి ఉన్నాయి. పక్కనే ఉన్న పడక కుర్చీ అలానే వుంది మాసి. ఓ మూల కాసిని గిన్నెలు చిందరవందరగా ఉన్నాయి. అన్నీ సర్దుకునే ఓపిక లేదు. కొత్త దుప్పటి పెట్టెలో ఏ మూల ఉందో వెతుక్కునే ఓపికలేదు. గోడలకు పాత ఫోటోలు వేలాడుతున్నాయి. అందులో ఒకటి తన భార్యది, మరొకటి కూతురూ అల్లుడూ తీయించుకున్నది. తక్కినవి మనుమలవీ, మనమరాండ్రివీ. ఎంచేతో తను ఎప్పుడూ ఫోటో తీయించుకోలేదు. ఆ గోడన తన ఫోటో మాత్రం లేదు.

తను గవర్నమెంటులో గుమస్తాగా చేశాడు. సూపర్వైజర్‌గా రిటైరయ్యాడు. గుమస్తాగా కొన్నాళ్ళకి తనకి పెళ్ళైంది. మరి కొన్నాళ్ళకి ఒక ఆడపిల్ల పుట్టింది. ఇంకొన్నాళ్ళకి ఏదో జ్వరం తగిలి భార్య చని పోయింది. అప్పటికి కూతురు ఇంకా చిన్నపిల్ల. తను మళ్ళా పెళ్లి చేసు కోలేదు. పెళ్ళి చేసుకుంటే ఆ రెండవ భార్య కూతుర్ని సరిగా చూడదేమో నని భయపడ్డాడు. అప్పటినుంచి వంట తనే చేసుకున్నాడు. కూతుర్ని పెంచి పెద్దదాన్ని చేశాడు, పెళ్ళిచేశాడు. ఆ అల్లుడికి మిలటరీ ఉద్యోగం. అక్కడెక్కడో దూరాన హిమాచల ప్రాంతాలలో ఉన్నాడు ఎప్పుడూ ఎక్కువ రాకపోకలు లేవు. ఆ కూతురికీ నలుగురు పిల్లలు ఇద్దరూ కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. వాళ్ళు పెద్దవాళ్ళయ్యారు.

తను రిటైరయ్యాక కూతురిదగ్గరికి వెళ్ళి ఉందా మనుకున్నాడు. కాని ఆ కూతురు రమ్మనలేదు.

"ఇంతదూరాన నువ్వు ఉండలేవు ఇక్కడ బాగా చలి ఎక్కువ. నీ ఆరోగ్యంకూడా దెబ్బతింటుంది. అక్కడే సొంత ఇంట్లోనే ఉంటే బాగుంటుంది. ఎప్పుడైనా వస్తూ పోతూ ఉండవచ్చు" అని రాసింది. ఇంక తనకు వెళ్ళడానికి ఉత్సాహం కలగలేదు. ఆ ఉన్న ఇంట్లోనే పెన్షను

కథా నిలయం
645


డబ్బులతో ఒంటరిగా కాలక్షేపం చేయ్యడం ప్రారంభించాడు. ఎప్పుడైనా వస్తూపోతూ ఉండవచ్చంది అదీ ఉత్తమాటే ? "ఎప్పుడు వస్తానని రాసినా "వద్దు నేనే వస్తాను" అంటుంది. ఇంత దూరం నీవు ఒంటరిగా రాలేవు ! ఇదిగో ఈ వేసవి సెలవుల్లో మేమే వస్తాం. ఇదుగో ఈ చలికాలంలో పిల్లల్ని తీసుకువస్తాను" అంటూ ఇలా రాస్తుంది. దాంతో తనకు ఉత్సాహం తగ్గిపోయి ప్రయాణం ఆగిపోతుంది. ఆమె రావడం ఎప్పుడూ ఉండదు. మళ్ళా రాకపోవడానికి కారణాలు రాస్తుంది ఎప్పుడూ అంతే. ఆమె ఉత్తరాల్లో ఆఖరి వాక్యాలన్నీ ఒక్కలాగే ఉంటాయి ఎప్పుడూ !

"పెద్దవాడిని కాలేజీలో చేర్పించాలి. చిన్నదానికి బట్టలు కుట్టించాలి ఆరోగ్యం బాగుండక ఆయన ఆఫీసుకు వెళ్ళటంలేదు. డబ్బుకి చాలా ఇబ్బందిపడుతున్నాం. ఏమైనా వీలుగా ఉంటే పంపించు" అంతే ఎప్పుడూ ఏవో ఇబ్బందులు డబ్బు ఖర్చులు ! ఈ ముసలాడి దగ్గర ఇంకా ఏమైనా మిగిలి ఉందేమో లాక్కుందామని తాపత్రయం. అయినా అల్లుడి సంపాదన అంతా ఏమవుతోందో తనకూ తెలుసు. అతని దురలవాట్లకి ఎంత డబ్బైనా చాలదు. అంచేత అడపా దడపా అమ్మాయి డబ్బు ఇబ్బంది పడుతూ ఉండడమూ నిజమే ! అందుకే తను ఏమీ బాధపడడు. కొన ఊపిరి ఉన్నంత వరకు ఆ కూతురికి సహాయపడాలనే కోరుకుంటాడు. ఏదో ఆ మూల ఈ మూల ఏదైనా మిగిలి ఉంటే వెతికి పంపిస్తూ ఉంటాడు. ఎప్పుడో పండిన ఆకులా తను రాలిపోతాడు. అప్పుడింకేమీ మిగలదు అప్పుడే మౌతుందో తనకు తెలుసు. ఎన్నడూ రాని కూతురు అప్పుడు వస్తుంది. ఈ కొంప వచ్చిన ధరకు అమ్ముకుని డబ్బుతీసుకుపోతుంది. అంతే ఇంక తన ఊరూ పేరూ ఎవరికి గుర్తుండదు. ఈ విశాలమైన విశ్వంలో ఒక్క నిరర్థకమైన బిందువు నిష్క్రమిస్తుంది

తన బ్రతుకులోని ఒంటరితనమూ, శూన్యమూ ఒక్కొక్కసారి తన్ను దహిస్తాయి. చిన్నప్పటి నుంచి ఇల్లూ ఉద్యోగమూ తప్ప తన కింకే

జ్ఞాపకాలు లేవు. వచ్చిన జీతం జాగ్రత్తగా వాడుకోవడమూ కూతురు జీవితం సుఖంగా గడవాలనీ ఆమెకెప్పుడేమవసరమౌతుందోననీ, మిగిలిన డబ్బులు జాగ్రత్తగా దాచుకోవడమూ అంతే తన జీవితము ? ఎప్పుడూ తన సుఖాన్ని గురించి ఆలోచించలేదు. ఎప్పుడూ ఒక సినిమాకి నాటకానికి కూడా సరదాపడి వెళ్ళలేదు. ప్రాణాలన్నీ ఆ ఒక్క కూతురుమీద పెట్టు కున్నాడు. ఆమె సుఖమే తన సుఖమనుకున్నాడు. అయినా పెళ్ళికాగానే ఆమె తనకు దూరమైంది. బ్రతుకులో అనారోగ్యం, ఒంటరితనం మిగి లాయి. తన జీవితానికి ప్రయోజనమేమిటో ? ఉద్యోగం చెయ్యడం, కన్న కూతుర్ని పెంచి పెద్దదాన్ని చెయ్యడం, ఎంతో జాగ్రత్తగా వుండి నాలుగు డబ్బులు కూతురికోసం దాచడమూ, ఇంతే ఈ బ్రతుకు. తాను సాధించినది ఇంతకన్నా తను సుఖపడిందీ లేదు, ఇతరులను సుఖపెట్టిందీలేదు. ఈ బ్రతుక్కి ఏ ప్రయోజనమూ కనిపించదు. ఆలికి అన్నం పెట్టటం ఊరికి ఉపకారమా అన్న సామెత జ్ఞాపకం వస్తోంది. అయినా ఈ మహా ప్రపంచంలో ఇలాంటి బ్రతుకులెన్నో కోటానుకోట్లు. వాటి ప్రయోజన మేమిటో, ఈ వ్యక్తులను ఎందుకు సృష్టిస్తున్నాడో, ఎందుకు నశింపచేస్తు న్నాడో ఆ సృష్టికర్త ఎవరైనా ఉంటే అతనికి తెలియాలి. ఒక మహత్తర మైన జలరాశిలో తానొక అల్పమైన నీటిబిందువు. దాని ఉనికి ప్రయోజనమూ లేదు. ప్రత్యేకతా లేదు.

* * *

తలుపు తోసుకుని రంగాజమ్మ వచ్చింది. చేతిలో పులుసు గిన్నె ఉంది. ఆ గిన్నె అక్కడ పెట్టి సంతోషంగా కూర్చుంది. కొడుకూ, కోడలూ ఇప్పుడే వెళ్ళారు. ఇల్లు తాళం పెట్టుకు వచ్చాను. ఇవ్వాళ మూడు ఆటలు ఆడదాం !" అంది. సాయంకాలం దాకా ఆడుకుందాం అనే చిన్న పిల్లలా సంబరపడుతూ. తనకేమీ ఉత్సాహంగా లేదు, దిగాలుగా ఉంది.

మాట్లాడకుండా ఊరుకున్నాడు. రంగాజమ్మ మళ్ళా అంది "నువ్వింక అన్నం తినలేదుగా ! రా తిందువుగాని, పులుసు పట్టుకువచ్చాను." ఆమె ఆకుకోసం వెతుకుతోంది. అప్పటికి తను ధైర్యం తెచ్చుకున్నాడు. చూడు, రంగాజమ్మా ! ఇలా నువ్వు కొడకూ, కోడలూ వెళ్ళగానే ఇక్కడికి వచ్చేస్తూ ఉంటే ఏం బావుంటుంది. ఎదురింటివాళ్ళు, పక్కింటివాళ్ళు అంతా ఏమనుకుంటారు!" అన్నాడు దిగులుగా !

చెంపమీద ఛెళ్ళున కొట్టినట్లు ఆమె ఉలిక్కి పడింది. ముఖాన నెత్తురు చుక్కలేదు. చేతిలో ఆకు అక్కడ వదిలేసి గబగబ వెళ్ళిపోయింది తనకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఉన్న ఒక్క దీపం ఆర్పుకున్నట్లయింది. బ్రతుకు మళ్ళా చీకటి చేసుకున్నాడు. ఆప్యాయంగా ప్రేమగా ముందుకు చాపిన చేతిని ముళ్ళతో పొడిచాడు.

రంగాజమ్మ వదిలిన ఆకు, పులుసు గిన్నె అక్కడే ఉన్నాయి తనకు ఆకలి కాలేదు. అన్నం తినాలనిపించలేదు. అవి రెండూ తీసి ఒక మూలగా పెట్టాడు. నిద్రరాకపోయినా కాస్సేపు కళ్ళుమూసుకు పడుకుందామని లేచాడు. తలుపు తోసుకు రంగాజమ్మ మళ్ళా వచ్చింది. దిగులుగా అన్నది "నువ్వు అన్నం తిను, తరువాత వెళ్ళిపోతానులే."

తనకు మనస్సు కరిగిపోయింది. మనిషి అంతరాంతరాలలో ఒదిగి ఉండే ఒంటరితనం, ఆమె కళ్ళల్లో తొంగి చూస్తోంది. ఆ కొడుక్కూ, కోడలికీ ఆమె అక్కరలేదు. వాళ్ళ వ్యాపకాలు వాళ్ళవి. వాళ్ళ సరదాలు వాళ్ళవి. గత్యంతరం లేక ఒంటరిగా ఆ పంచన పడిఉంటున్నది. ఎవ్వరికి కాని బ్రతుకు ఎడారి.

మాడిన అన్నం ఆకులో పెట్టుకున్నాడు. రంగాజమ్మ పులుసు పోసింది. *